

వంద రోజుల్లో శిక్ష పడాలి

నేరగాళ్లలో భయం పుట్టాలి

బాధితులకు భరోసాగా నిలవండి

కొత్త ఎస్ఐలకు హోం మంత్రి అనిత సూచన

పీటీసీలో ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్



అనంతలో జరిగిన ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి అనిత, ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ఐలు

అనంతపురం సెంట్రల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నేరం చేసినవారికి వంద రోజుల్లో శిక్ష పడేలా పోలీసు యంత్రాంగం పనిచేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఎవరికి ఏ చిన్న సమస్య ఎదురైనా వెంటనే గుర్తొచ్చేది పోలీసులేనని అనంతపురం పీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న 394 మంది ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో శనివారం ఆమె పాల్గొన్నారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆమె ప్రసంగించారు. 'పోలీసు ఉద్యోగం చేపట్టాక ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటివరకు మీ పరిధి చాలా చిన్నది. రేపటి నుంచి చాలా విస్తృతమౌతుంది..' అని విధుల్లో చేరబోతున్న ఎస్ఐలనుద్దేశించి అన్నారు. పోలీసులు చెప్పే ఒక్క మాటతో బాధితుల కష్టాలు సగం తీరుతాయని అన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తపనతో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. తనను హోం మంత్రిని చేసిన సీఎం (మిగతా 6వ పేజీలో..)

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 479 మంది గైర్హాజరు.. పరిశీలించిన కలెక్టర్



మంగళకర కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కొత్తచెరువు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 42 పరీక్షా కేంద్రాల్లో జనరల్ కేటగిరి కింద 11,843 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 383 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1580 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 96 మంది గైర్హాజరయ్యారని.. మొత్తం తొలిరోజు 479 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. పుట్టపర్తి మండలంలోని జగరాశిపల్లి వద్ద ఉన్న మంగళకర జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ టీఎస్ చేతన్ తనిఖీ చేశారు. విద్యార్థులు మొదటి రోజు పరీక్షా కేంద్రాల వద్ద హడావుడిగా తమ హాల్‌టికెట్ నెంబర్లు ఏ గదిలో ఉన్నాయోనని నోటీసు బోర్డులో వెతికారు. సమయం సమీపిస్తుండటంతో కొంతమంది విద్యార్థులు ఉరుకులు, పరుగులతో కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరిగాయని డీఐఈఓ తెలిపారు.



పరుగులు తీస్తున్న విద్యార్థులు

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

కొత్తచెరువు మండలం అప్పలోల్లపల్లి గ్రామంలో చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ చేతన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. వృద్ధులు, దివ్యాంగులతో ముచ్చటించారు.

తప్పుచేసిన వారికి

శిక్ష తప్పదు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



పింఛన్లు అందజేస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తప్పుచేస్తే ఎలాంటివారికైనా శిక్ష తప్పదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని మాగేచెరువు పంచాయతీలో శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోసాని కృష్ణమురళి అరెస్ట్ విషయంలో ఎలాంటి కక్ష సాధింపులేదన్నారు. చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇటీవల అసెంబ్లీ సమావేశంలో ప్రతిపక్ష హోదా కావాలని అల్లరి చేశారన్నారు. ప్రతిపక్ష హోదా ఎలా వస్తుందో సీఎంగా పని చేసిన వ్యక్తికి తెలియదా అని ప్రశ్నించారు. అనంతరం అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, పెన్షన్లు గృహాలు మంజూరు చేస్తామన్నారు. సోమందేపల్లిలో టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని మహిళలు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా 25మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామన్నారు. జూన్ నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అందజేస్తామన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రైతులు, బీసీలకు పెద్దపీట వేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమను రతనాలసీమగా మార్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. రాంపురం తనకు పుట్టినిల్లయితే మాగేచెరువు మెట్టినిల్లన్నారు. గ్రామంలో ప్రతి సమస్య పరిష్కరిస్తామన్నారు. అనంతరం గ్రామంలోని ఎస్సీకాలనీలో రూ.12లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు


మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో వెలసిన అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె అధికారులు, ప్రజాప్రతినిధులతో స్పెషల్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 500మందికిపైగా పలు సమస్యలను విన్నవించుకున్నారు. పింఛన్, గృహనిర్మాణం, ఇంటిపట్టాలు, భూసమస్యలు, భూకబ్జాలు, తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో చేయని అభివృద్ధిని తాము ఎనిమిది నెలల్లో చేసి చూపించామన్నారు.

సాగులో ఉన్నా ఇతరులకు పట్టాలు : నారాయణ, మునిమడుగు



పెనుకొండ మండలం మునిమడుగు పంచాయతీ పరిధిలో 188సర్వే నంబరులో మూడెకరాల భూమిని ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. గత ప్రభుత్వంలో మా గ్రామానికి చెందిన వ్యక్తి మా భూమి పై 1బి అడంగల్ తెచ్చుకున్నాడు. మాకు మీరే న్యాయం చేయాలి. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ వారంలో విచారణచేసి సర్వేనంబరును హోల్డ్‌లో పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

దేవుడి మాన్యం కబ్జా: పూజారి ప్రభాకర్‌స్వామి



పెనుకొండ మండలం దుద్దేబండ పంచాయతీ పరిధిలో 136-2 సర్వేనంబరులో ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూమి 60సెంట్లు కబ్జా చేశారు. దేవుడి భూమిని కబ్జా నుంచి విడిపించి, ఆలయ అభివృద్ధికి కృషి చేయండి.

పింఛన్ ఇప్పించండి: భనుమక్క, కురుబవాండ్లపల్లి



రెండేళ్ల కిందట నా భర్త కుంటిపోతన్న చనిపోయాడు. జీవనోపాధి ఇబ్బందిగా ఉంది. గత పాలనలో పింఛన్ కోసం పాలకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. నాకు న్యాయం చేసి పింఛన్ ఇప్పించండి.

ఇక తప్పించుకోలేరు..!



అడుగడుగునా నిఘా నేత్రాలు

'పురం'లో 500 సీసీ కెమెరాలు

సోలార్ వైర్‌లెస్‌తో నిర్వహణ

కెమెరాలు ధ్వంసం చేసినా ఫొటోలు..

హిందూపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో నిఘా నేత్రాలది కీలక పాత్ర. నేరాల అడ్డుకట్టకు పోలీసులు సాంకేతికపరంగా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. నేరస్థులు అంతకన్నా తెలివిగా తప్పించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో పోలీసులు మరింత ఆధునికతను జోడిస్తున్నారు. హిందూపురం పట్టణంలో ఎక్కడ నేరాలు జరిగినా ఆ దృశ్యాలు అందేలా పోలీస్‌శాఖ పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హిందూపురం పట్టణం, మండలంలోనే 500 సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాలతోపాటు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్లు, ప్రార్థనా మందిరాలు, మతపరంగా సున్నిత ప్రాంతాలు, నేరస్థుల హాట్‌స్పాట్‌లు, పాత నేరస్థులు నివాసమున్న ప్రాంతాల్లో నిఘా నేత్రాలు ఏర్పాటు చేస్తారు. ప్రజలు, పరిశ్రమల యజమానుల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్‌శాఖ శ్రీకారం చుట్టింది. ఎక్కడ నేరం జరిగినా నమోదు చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు ఉంటుంది. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు విద్యుత్ సరఫరా లేకపోయినా సోలార్ ద్వారా పనిచేస్తాయి. కటిక చీకటిలోనూ వాహనాలు, మనుషుల ఫొటోలను తీసేవిధంగా అత్యాధునిక ఏర్పాట్లు చేస్తున్నారు. నేరస్థులు నేరం చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలను ధ్వంసం చేసినా.. ఆ వ్యక్తుల ఫొటోలు తీసి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. జనం కూడా అపార్ట్‌మెంట్లు, షాపులవద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సి అవసరం ఉందని పోలీసులు చెబుతున్నారు. అప్పుడే నేరాల నియంత్రణకు పూర్తిగా అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది.





హిందూపురం డీఎస్పీ కార్యాలయం చేరిన సీసీ కెమెరాలు

మొదటి విడత 200 కెమెరాలు

హిందూపురం పట్టణం, మండలంలో 500 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయగా.. మొదటి విడతలో 200 కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో గ్రీన్‌కో కంపెనీ 150 కెమెరాలను హిందూపురానికి చేర్చింది. విప్రో సంస్థ మరో 50 కెమెరాలు ఇవ్వడానికి సిద్ధమయింది. వీటిని 15రోజుల్లోపు ఏర్పాటు చేయనున్నారు. సీఎస్ఆర్ నిధుల కింద మరికొంతమంది పరిశ్రమల యజమానులు సీసీ కెమెరాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

● సోలార్ వైర్‌లెస్ సీసీ కెమెరాలు..



పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటు చేసిన సోలార్ వైర్లెస్ సీసీ కెమెరా

గతంలో హిందూపురం నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వైర్లతో కూడుకున్నవే. కొన్ని సందర్భాల్లో నేరస్థులు వైర్లు కత్తిరించి సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా తమ పని సులభంగా చేసుకుంటూ వెళ్లారు. మారిన సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యుత్ లేకపోయినా, కటిక చీకటిలో సైతం వాహనాల నంబర్లు, మనుషుల ముఖాలను గుర్తించేవిధంగా ఏర్పాటు చేసిన కెమెరాలను తెప్పించారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనం సందర్భంగా ఒకే రోజు పట్టణంతోపాటు చుట్టుపక్కలవారు వేడుకలు చూడటానికి సుమారు రెండు లక్షల మంది వరకు హాజరవుతారు. నిమజ్జనం సందర్భంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఏదైనా నేరం జరిగితే పోలీసులు గుర్తించలేకపోతున్నారు. సోలార్ సిస్టం ద్వారా ఏర్పాటుచేసే కెమెరాలకు 12గంటల పాటు చార్జింగ్ ఉంటుంది. దీనివల్ల సాయంత్రం 6 నుంచి ఉదయం 6 వరకు ఏమి జరిగినా సీసీ కెమెరాలో నమోదవుతుంది.

నేరాల నియంత్రణకు చర్యలు : మహేష్, డీఎస్పీ, హిందూపురం



హిందూపురం పట్టణం, మండలంలో 500 సీసీ కెమెరాలు, లేపాక్షి, చిలమత్తూరులో మరో 300 సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇవి పూర్తయితే నేరాలను నియంత్రించవచ్చు. విద్యుత్ సరఫరా లేకపోయినా వైర్‌లెస్ నిఘా నేత్రాలు పనిచేయనున్నాయి. నేరాల నియంత్రణకు, నేరస్థులపై నిఘా పెట్టడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుంది. ప్రజలు కూడా సహకరించి అపార్ట్‌మెంట్లు, షాపులు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే వారికి కూడా ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుంది.

విద్యార్థులకు పౌష్టికాహారం

మధ్యాహ్న భోజన పథకంలో నూతన మెనూ ప్రారంభం



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు .

ధర్మవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో నూతన మెనూ ప్రారంభించారు. శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పరిధిలో 2,097 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 1.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారందరికీ మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించనున్నారు. మారిన మెనూ ప్రకారం ప్రతి సోమవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడకబెట్టిన గుడ్డు, చక్కీ ఇస్తారు. మంగళవారం అన్నం, గుడ్డుకూర, రసం, రాగిజావ వడ్డిస్తారు. బుధవారం వెజ్‌పలావ్, బంగాళదుంప కూర్మా, ఉడికించిన గుడ్డు, చక్కీ ఇస్తారు, గురువారం అన్నం, సాంబారు, గుడ్డుకూర, రాగిజావ, శుక్రవారం పులిహోర, చట్నీ, గోంగుర తదితర కూరగాయల చట్నీ, ఉడికించిన గుడ్డు ఇవ్వనున్నారు. శనివారం అన్నం, కాయగూరల కర్రీ, రసం, రాగి జావ, తీపి పొంగలి వడ్డిస్తారు. విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా పూర్తిస్థాయి పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

భోజనం రుచిగా ఉంది



మధ్యాహ్న భోజనం చాలా రుచిగా ఉంది. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 6వతరగతి చదువుతున్నా. నేను ప్రతి రోజు పాఠశాలకు నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్నా. మధ్యాహ్న సమయంలో భోజనానికి ఇంటికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది. ప్రభుత్వం మధ్యాహ్న సమయంలో చక్కటి భోజనం అందించడం ఎంతో సంతోషంగా ఉంది.

- అఖిల్‌తేజ్, 6వ తరగతి, ధర్మవరం

పోషక విలువలతో కూడిన భోజనం



ప్రభుత్వం విద్యార్థుల కోసం పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందిస్తోంది. విద్యార్థినులు ప్రతి రోజు ఉదయం 9 గంటలకే పాఠశాలకు వస్తారు. కొంతమంది విద్యార్థినులు పాఠశాలకు సమయం అవుతుందని ఇంట్లో ఏమీ తినకుండా వస్తారు. అలాంటి వారికి నూతన మెనూ ఆకలితీర్చుతుంది. ప్రభుత్వం విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారిస్తోంది.

- ఉమాపతి, హెచ్ఎం, మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల

9 నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

- పకడ్బందీగా సౌకర్యాలు కల్పించాలి
- యువత ఎక్కువగా పాల్గొనాలి
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేది నుంచి ప్రారంభమయ్యే ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలను వివిధ శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కదిరికి తలమానికం అన్నారు. 15 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఇందుకు అందరి సహకారం అవసరం అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. హిందుపురం వైపు నుంచి వచ్చే భక్తులకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుంచి కోనేరు వరకు ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు సౌకర్యాల కల్పనలో ఖర్చుకు వెనుకాడవద్దని అన్నారు. ప్రభుత్వం, టీటీడీ నుంచి స్వామికి పట్టు వస్త్రాలు తెచ్చే సాంప్రదాయాన్ని గతంలో తానే మొదలు పెట్టానని గుర్తు చేశారు. ఆర్డీవో వీవీఎస్ శర్మ మాట్లాడుతూ.. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి మాట్లాడుతూ.. రథోత్సవం రోజున భక్తులకు అధికారులు సహకరించాలని కోరారు. ఈఓ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఆయా శాఖల వారిగా చేయవలసిన పనులను వివరించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, బుక్‌లెట్‌ను విడుదల చేశారు. సమావేశంలో అర్చకులు అంజనాచార్యులు, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, సీఐ నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు ఉత్తమరెడ్డి, తలుపుల గంగాధర్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ దీక్షలు



ఓడీసీలో నెలవంక దర్శనం

పుట్టపర్తి రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఆదివారం నుంచి రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 30 రోజుల ఉపవాసదీక్షలు ఆరంభించనున్నారు. నెలవంక శనివారం కనిపించిన నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి ఉపవాసదీక్షలు చేపట్టనున్నారు. ఉపవాసం ప్రారంభించే ముందు సెహరీ, సాయంత్రం ఉపవాసం ముగించే ముందు ఇఫ్తార్ నిర్వహిస్తారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాసదీక్షలను మూడు అష్రాలుగా విభజించారు, తొలిపదిరోజుల ఉపవాసకాలాన్ని రెహమత్, రెండో వారంలో వచ్చే పదిరోజుల కాలాన్ని బర్కత్‌అని, చివరి పదిరోజులను మగ్‌ఫిరత్‌గా భావిస్తారు.



	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.31 ఆదివారం సాయంత్రం	5.14 సోమవారం ఉదయం
కదిరి	6.28 ఆదివారం సాయంత్రం	5.17 సోమవారం ఉదయం
ధర్మవరం	6.31 ఆదివారం సాయంత్రం	5.14 సోమవారం ఉదయం
హిందూపురం	6.33 ఆదివారం సాయంత్ర	5.12 సోమవారం ఉదయం
పెనుకొండ	6.33 ఆదివారం సాయంత్రం	5.12 సోమవారం ఉదయం

విరబూసిన పూత

వాతావరణంలో మార్పులే కారణం 6





గౌరవ వందనం స్వీకరిస్తున్న హోంమంత్రి అనిత



తల్లికి పాదాభివందనం



పరేడ్‌ను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



హాజరైన ఎస్ఐల కుటుంబ సభ్యులు



పాసింగ్ అవుట్ పరేడ్‌ను తిలకిస్తున్న పోలీస్ అధికారులు



ఆనంద క్షణాలు..



కుటుంబ సభ్యులతో...



వంద రోజుల్లో శిక్ష పడాలి

(5వ పేజీ తరువాయి)



చంద్రబాబు, ఎన్డీఏ కూటమి సభ్యులకు ధన్యవాదాలని అన్నారు. హోం మంత్రిగా ఇలాంటి పరేడ్ మైదానంలో నిలబడాలంటే అదృష్టం, అర్హత, ప్రజల దీవెనలు ఉండాలని అన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్లుగా 394 మంది సమాజంలో అడుగుపెట్టడం అరుదైన అంశమని అన్నారు. పాసింగ్ అవుట్ పెరేడ్‌లో నిలబడ్డ మిమ్మల్ని చూస్తున్న తల్లిదండ్రుల హృదయాలు ఆనందంతో ఉప్పొంగిపోతున్నాయని అన్నారు. ఎంటెక్, బీటెక్, ఫార్మసీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కోర్సులు అభ్యసించిన వారు ఎస్‌లుగా ఎన్నికయ్యారని అన్నారు. ఇంజనీరింగ్ కోర్సులు చేసినవారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా రూ.లక్షల జీతాలు తీసుకోవచ్చని, అయినా ప్రజాసేవ చేయాలనే తపన, పోలీస్ ఉద్యోగం పట్ల ప్యాషన్‌తో ముందుకు వచ్చారని అన్నారు. పోలీసు ఉద్యోగంలోకి రావాలంటే త్యాగం చేయాలని, ఎంత కష్టపడి చదవారో అర్థమౌతోందని అన్నారు. పోలీసులు అంటే ఇలా ఉండాలి అనేలా నడుచుకోవాలని సూచించారు. పోలీసులు చేసే తప్పులు, ఒప్పులు ప్రభుత్వం మీద ప్రభావం చూపుతాయని అన్నారు.

మంచి నాయకత్వం

సాంకేతికతను ప్రోత్సహించే విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పని చేస్తున్నామని హోం మంత్రి అన్నారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని, పోలీసులను కూడా బురడీ కొట్టించే తెలివితేటలు దొంగలకు ఉన్నాయని అన్నారు. నేరస్థులకే అన్ని తెలివితేటలుంటే.. కష్టపడి చదివి, కఠినతరమైన శిక్షణపొంది, జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన పోలీసులకు ఇంకెన్ని తెలివితేటలుండాలో ఒకసారి ఆలోచన చేసుకోవాలని సూచించారు. అందుకే నిరంతర అభ్యసకులుగా ఉండాలని అన్నారు. సైబర్ నేరాల కట్టడికి ప్రతి జిల్లాలో ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారని అన్నారు. శిక్షణ పొందిన ఎస్‌ఐలలో 97 మంది మహిళలు ఉన్నారని, అందరికీ శిరస్సు వంచి సెల్యూట్ చేస్తున్నాని అన్నారు.

నేరాలను అరికట్టేందుకు..

మహిళల హత్యలు, అత్యాచారాలను కట్టడి చేయడానికి సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్నారని అన్నారు. ఇలాంటి నేరాలు చేసేవారికి వందరోజుల్లో శిక్ష పడేలా యంత్రాంగం పనిచేయాలని సీఎం ఆదేశించారని అన్నారు. ఫోరెన్సిక్ రిపోర్ట్, హరామ్ సర్టిఫికెట్, చార్జీషీట్, కోర్టుకు ఆధారాలు సమర్పించడం.. ఇలా మొత్తం ప్రక్రియ వంద రోజుల్లో పూర్తికావాలని అన్నారు. రాష్ట్రం ఎందుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో గంజాయి ఒకటని, గంజాయి ఒక తరాన్ని నాశనం చేసే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యం కారణంగా స్కూల్ బ్యాగుల్లోకి గంజాయి చేరిందని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో పోలీసు యంత్రాంగం గంజాయి సాగును అరికడుతోందని అన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడానికి ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, బడ్జెట్‌లో నిధులు కేటాయించామనిఅన్నారు. తొమ్మిది నెలల కాలంలోనే లక్ష కేజీలపైన గంజాయిని ధ్వంసం చేశామని అన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం, కాకినాడ, వెస్ట్ గోదావరి ఇలా పలు జిల్లాల్లో పోలీసు యంత్రాంగం గంజాయి రవాణా జరగకుండా కట్టడి చేసిందని అన్నారు.

రాగద్వేషాలకు అతీతంగా సేవలు: డీజీపీ



రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించాలని శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరబోతున్న ఎస్‌ఐలకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పిలుపునిచ్చారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో చేసిన ఆ ప్రమాణానికి అనుగుణంగానే ఉద్యోగ విరమణ పొందే వరకూ పనిచేయాలని సూచించారు. మానవ హక్కులను కాపాడుతూనే... రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలకు అనుగుణంగా పనిచేయాలని అన్నారు. పోలీసు సేవలు అవసరమైన వారి పట్ల మరింత సానుభూతితో ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తోందని అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కోసం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రస్సల్ సిస్టమ్‌ను అమలు చేస్తోందని అన్నారు. ఈ సిస్టమ్‌కు మంచి స్పందన లభిస్తోందని అన్నారు. 52 శాతం మంది మహిళలు పిటిషనర్లుగా వస్తున్నారంటే... పోలీసుశాఖ, ప్రభుత్వంపై విశ్వాసం పెరిగినట్లేనని స్పష్టంగా అవగతమవుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు శిక్షణా విభాగం ఐజీ కేవీ మోహన్‌రావు, ఏపీఎస్పీ బెటాలియన్ విభాగం ఐజీ రాజకుమారి, కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీలు జగదీష్, రత్న తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నుంచి ప్రసంశాపత్రం, ట్రోఫీ, మెడల్‌ను అందుకుంటున్న పి.వీరచక్ర దొర, మల్లికార్జున, అరుణ్ వెంకట్ సాయినాథ్, జమలయ్య, మంజునాథ్

ఏటికి ఎదురీదిన ఏడుకొండలు



తల్లి సుశీల, చెల్లి శ్రావణితో ఏడుకొండలు

నెల్లూరు జిల్లా వలేటివారిపాళెం మండలం పోలినేనివారిపాళెం గ్రామానికి చెందిన నేత కూరి వెంకటేశ్వర్లు, సుశీల దంపతుల కుమారుడు ఏడుకొండలు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎనిమిదో తరగతి వరకు స్వగ్రామంలో చదువుకున్నాడు. ఆ సమయంలో తండ్రి వెంకటేశ్వర్లు మరణించాడు. కుటుంబాన్ని పోషించేందుకు బెంగళూరుకు వలస వెళ్లిన ఆయన.. బేల్దారి పనులుచేస్తూ 2005లో మృతిచెందారు. తండ్రి పనిచేస్తే గాని వారికి పూట గడవదు. ఏడుకొండలు, తల్లి సుశీల, చెల్లెలు శ్రావణి దిక్కులేనివారయ్యారు. అయినా పట్టువీడకుండా చదివాడు. కందుకూరులో ఇంటర్, సింగరాయకొండలో టీటీసీ పూర్తిచేశాడు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టు సాధించాలని ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించాలన్న కసితో కూలిపనులకు వెళుతూనే ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తిచేశాడు. ఎస్ఐ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ వచ్చే సమయానికి చేతిలో చిల్లిగవ్వలేదు. పరిస్థితిని గమనించిన ఆదే గ్రామానికి చెందిన అనుమోలు రవీంద్ర, మాదాల లక్ష్మీనరసింహ అనే రైతులు ఆర్థిక సాయం చేశారు. కాకినాడకు వెళ్లి శిక్షణ తీసుకున్న ఏడుకొండలు.. ఎస్ఐ పరీక్షల్లో 398 ర్యాంకును సాధించాడు.

కవల సోదరికి సెల్యూట్



పాసింగ్ అవుట్ పరేడ్ నుంచి బయటకు వచ్చిన గ్రైసీ.. ఓ కానిస్టేబుల్‌కు సెల్యూట్ చేశారు. ఆ కానిస్టేబుల్ ఎవరో కాదు.. స్వయానా ఆమె సోదరి. సోమందేపల్లి మండలం నల్లగొండరాయుని పల్లెకు చెందిన పరమేశ్వర్, సుశీల దంపతులకు కవలలుగా పుట్టారు గ్రైసీ, గ్లోరి. డిగ్రీ వరకు కలిసి చదువుకున్నారు. మొదట గ్లోరినే ఉద్యోగాన్ని సాధించారు. సచివాలయ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ, తన సోదరి గ్రైసీకి సాయపడ్డారు. ఎస్ఐ పోస్టు సాధించిన గ్రైసీ.. సెల్యూట్ చేసి తన సోదరికి కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రుల కష్టంతో ప్రభుత్వ కొలువులు సాధించామని వారు అన్నారు.

చైతన్య స్వరూపిణి



మొత్తం 394 మంది కొత్త ఎస్ఐలలో చైతన్య స్వరూపిణి గోల్డ్‌మెడల్ సాధించారు. కర్నూలుకు చెందిన వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతుల కూతురు చైతన్య. డిగ్రీలో బయోటెక్నాలజీ పూర్తిచేశారు. హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన తండ్రి వెంకటేశ్వర్లుని ఆదర్శంగా తీసుకుని ఎస్ఐ పోస్టును సాధించారు. 12 నెలల శిక్షణా కాలంలో ప్రతిభను చూపి హోం మంత్రి నుంచి గోల్డ్‌మెడల్ అందుకున్నారు.

భర్త ప్రోత్సాహంతోనే...



బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్ పూర్తిచేశాను. మాది పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంత్ర మండలం మార్టేరు. నేవల్ ఆర్మీలో పనిచేయాలని, యూనిఫాం వేసుకోవాలని చాలా ఇష్టపడ్డాను. పెళ్లి అయిన వారికి అవకాశం లేకపోవడంతో నిరాశపడ్డాను. నా భర్త సద్దాం సాదిక్ ప్రోత్సాహంతో ఎస్ఐ పరీక్షలు రాసి ర్యాంకు సాధించాను. తల్లి రెహనా అంజుం, నాన్న సలాహుద్దీన్, అత్త అప్సర జహాన్, మామ సాదిక్ నన్ను గ్రూప్-1 ఆఫీసర్‌గా చూడాలని కోరుకున్నారు. భవిష్యత్తులో వారి కలలను నెరవేరుస్తాను.

- సాహిబ అంజుం

ఐపీఎస్ సాధిస్తా...



ఐపీఎస్ సాధించాలని ఎస్ఐగా పరీక్షలు రాశాను. ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి, ఎస్ఐ పరీక్షల్లో ప్రిమిల్స్‌లో పాస్ అయ్యాను. ఈవెంట్స్‌లోనూ అర్హత సాధించాను. మెయిన్స్‌లో మెరిట్ వచ్చింది. శిక్షణా కాలంలో ప్రతి ఒక్కరూ మమ్మల్ని కుటుంబ సభ్యులుగా భావించి తీర్చిదిద్దారు. ఇక్కడి నుంచి వెళ్లాలంటే బాధగా ఉంది. ఆర్ఐ వేణుగోపాల్, ఇన్‌స్ట్రక్టర్స్, ఇండోర్ ఫ్యాకల్టీ, కేర్ టేకర్స్.. ఇలా అందరి సహకారం మరువలేనిది. మా కుటుంబ సభ్యులు కష్టపడి చదించారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాను.

- అరుణ్ వెంకట్ సాయినాథ్

సీమ ప్రయోజనాలను విస్మరిస్తున్న పాలకులు

రాయలసీమ అభివృద్ధి వేదిక



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పాలకులు రాయల సీమ ప్రజల ఆకాంక్షలు, ప్రయోజనాలను విస్మరిస్తున్నారని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ విమర్శించారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో మరో మూడు బ్యాంకుల విలీనం చేసిన తరువాత ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక అంబేడ్కర్ రోడ్డులో ఉన్న ఏపీజీబీ ప్రాంతీయ కార్యాలయం ఎదుట నిర్వహించారు. రాయలసీమ అభివృద్ధి వేదిక, సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ ఏపీలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు, తెలంగాణలోని వరంగల్ జిల్లాలో ముడిపడి ఉన్న గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి రాష్ట్రస్థాయి బ్యాంకుగా ఏర్పాటు చేయాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో అనంతగ్రామీణ బ్యాంకు, పినాకిని గ్రామీణ బ్యాంకు, రాయలసీమ గ్రామీణ బ్యాంకులను కలిపి 2006లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశారన్నారు. ప్రధాన కార్యాలయాన్ని కడపలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2024 నవంబరులో కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం గ్రామీణ బ్యాంకులన్నింటినీ విలీనం చేయాలని నిర్ణయించిన తరువాత ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే ఉంచాలని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకులు వెంకటనారాయణ, ముత్తూజా, రామాంజనేయులు, తిరుమలేష్, జిలాన్‌భాషా, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కృష్ణమూర్తి, రైతుసంఘం నాయకులు శివారెడ్డి, బీహెచ్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్‌పై చర్యలు తీసుకోండి

హోం మంత్రికి తెలుగు మహిళల ఫిర్యాదు



హోం శాఖ మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న తెలుగు మహిళలు

అనంతపురం అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితకు తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన హోంమంత్రిని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, తెలుగు మహిళలు కంతాదేవి, మహేశ్వరి శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. పోక్సో కేసులో బాధితుల పేర్లు వెల్లడించినందుకు మాజీ మహిళ కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆయనపై కేసు నమోదు చేయించారన్నారు. ఆ కేసు విషయంపై విచారణకు హాజరుకావాలని విజయవాడ పోలీసులు గోరంట్ల మాధవ్‌కు నోటీసులు ఇచ్చారన్నారు. ఆయనపై వచ్చిన అభియోగం గురించి మాట్లాడకుండా అసందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను ఉద్దేశిస్తూ రాష్ట్రంలో అంతర్యుద్ధం మొదలైందని వ్యాఖ్యానించడం వెనుక ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అలజడులు సృష్టించి, వ్యక్తులు, వర్గాల మధ్య వైషమ్యాలు సృష్టించేలా మాట్లాడిన గోరంట్ల మాధవ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

విరబూసిన పూత

డిసెంబరు ఆఖరు నుంచి రాక ఆరంభం
వాతావరణంలో మార్పులే కారణం
ఈసారి మామిడి దిగుబడిపై రైతుల్లో ఆశలు



కుందుర్పి వద్ద పూతతో కళకళలాడుతున్న మామిడి చెట్లు

అనంతపురం అర్బన్/కుందుర్పి మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మామిడి పూత ఈ సారి నిండుగా కనిపిస్తోంది. ప్రస్తుతం మామిడి తోటలన్నీ పూతతో కళకళలాడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 40వేల హెక్టార్లల్లో మామిడి పంట సాగులో ఉంది. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఆత్మకూరు, కదిరి, తలుపుల, తనకల్లు, గార్లదిన్నె, ముదిగుబ్బ, గాండ్లపెంట, ధర్మవరం తదితర ప్రాంతాల్లో ఎక్కువ శాతం మామిడి పంట సాగవుతోంది. ఆయా ప్రాంతాల్లో బేనీషా, బెంగళూరు రకం, తోతాపురి, నీలం, రాయల్ స్పెషల్, ఖాదర్, హిమయత్ తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. గత కొన్నేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మామిడి పూత వచ్చినట్లు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. పంట పలు దశల్లో తగిన సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

75 శాతం తోటలు పిందె దశలో..

గతేడాది డిసెంబరు నెలాఖరులో ఎండలు ప్రారంభమైనప్పటి నుంచి మామిడిలో పూత మొదలైంది. ఈ ఏడాది జనవరి మొదటి వారం నుంచి ఎక్కువ శాతం పూతకొచ్చింది. ప్రతి ఏడాది నవంబరు నెలాఖరు, డిసెంబరు మొదటి వారంలోనే మామిడి పూతకు రావాల్సి ఉంది. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో గత ఏడు సంవత్సరాలుగా కొంత ఆలస్యంగానే పూత వస్తోంది. గత ఏడాది తరహాలోనే ఈ సారి డిసెంబరు ఆఖరు వారంలోనే పూత మొదలైంది.

పూత పూసిన తోటల్లో 75 శాతం తోటలు ప్రస్తుతం పిందె దశకు చేరుకున్నాయి. 15 శాతం తోటల్లో పిందెనిమ్మకాయ సైజుకు చేరుకుంది. మిగిలిన 10 శాతం తోటలు ప్రస్తుతం పూత దశకు చేరుకుంటున్నాయి. జనవరిలో పూతకొచ్చిన తోటలు ఏప్రిల్ నెలలో కోత దశకు చేరుకోనున్నాయి.

పూత, పిందె బాగా పట్టింది



నాకు ఐదు ఎకరాల్లో మామిడి తోట ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పూత, పిందె బాగా పట్టింది. గతంతో పోలిస్తే చీడ, పీడల ఉధృతి కూడా తక్కువగానే ఉంది. అకాల వర్షాలు రాకపోతే మంచి దిగుబడి వస్తుందని ఆశతో ఉన్నాం.

- రైతు లోకేష్, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

ఆశతోనే...



15 ఎకరాల్లో మామిడి పంటను లీజుకు తీసుకున్నా. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టా. గత ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు లేకపోవడంతో నష్టపోయాం. గత కొన్నేళ్లలో ఎన్నడూ లేని విధంగా పూత బాగా వచ్చింది. పూతను చూస్తే ఈ సారి దిగుబడి బాగా వస్తుందన్న ఆశతో ఉన్నాం. దిగుబడి బాగా వస్తే అప్పులు తీరుతాయి.

- రైతు లక్ష్మణమూర్తి, కుందుర్పి

సస్యరక్షణ చర్యలు తప్పని సరి



మామిడిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది. గతంలోఎన్నడూ లేని విధంగా ఈ సారి పూత వచ్చింది. పూత, పిందె దశలోని తోటల్లో 5 నుంచి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటితో కలిపి చెట్లపై బాగా తడిసే విధంగా పిచికారి చేసుకోవాలి. అలాగే 2 మి.లీ క్వినాల్ ఫాస్ 2 మి.లీ హెక్సాకొనజోల్‌ను లీటరు నీటికి కలిసి చెట్లపై పిచికారి చేసుకోవడం ద్వారా పురుగులు, తెగుళ్ల సోకుండా నివారించవచ్చు. మామిడి పిందె గోళికాయ సైజులో ఉన్నప్పుడు 4 మి.లీ ప్లానోఫిక్స్‌ను 10 లీటర్ల నీటితో కలిసి చెట్లపై పిచికారి చేస్తే పిందెలు రాలిపోకుండా ఉంటాయి.

- చంద్రాయుడు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త , కళ్యాణదుర్గం

797 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 797 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 814 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.621 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

టమోటా కిలో రూ. 9



అనంతపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 9తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 22వేలు



అనంతపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22,850 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవింద తెలిపారు. కనిష్ఠంగా రూ. 8,120, సరాసరి రూ. 11,500తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 107 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బతుకు'బండి' లాగాలని...

సాగితే బండి లేదంటే బండ అని పల్లెల్లో వాహనాల గురించి గ్రామీణుల ఉవాచ. అలాంటి బండి ఇసుక తిన్నెల్లో ఇరుక్కుపోతే.. దాన్ని బయటకు తీయడానికి తీవ్రంగా శ్రమించాల్సిందే. ఇలాంటి ఘటనలు బొమ్మనహాళ్ మండలంలోని సింగానహళ్లి గ్రామ సమీపంలోని వేదవతి హగరిలో నిత్యం జరుగుతుంటాయి. కల్లుదేవనహళ్లి, బండూరుగ్రామాల రోడ్డు నుంచి సింగానహళ్లి గ్రామానికి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైంది. దీంతో ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు నదిలోని ఇసుకలోనే వెళుతున్నాయి. సింగానహళ్లి గ్రామానికి చెందిన వ్యవసాయకూలీలు మిరప కోత కోసం రూపనగుడి, ఎత్తినబూదేహాళ్ తదితర ప్రాంతాలకు ఆటోలో వెళుతున్నారు. శ్రీధరఘట్ట, ఉప్పరహాళ్, ఉద్దేహాళ్ గ్రామాల మీదుగా వస్తే ఆటో వారికి దూరం అవుతుందని కూలీలు ఇచ్చే చార్జీలు గిట్టుబాటు కాదని ఆటో వారు కోతకు గురైన మార్గంలోని వెళుతున్నారు. బండి ఇసుకలో ఇరుక్కుపోతే కూలీలను కిందకు దింపి వారితోనే తోయిస్తున్నారు. పొట్టగడవాలంటే కూలి పనులకు వెళ్లక తప్పని స్థితిలో వారు కిక్కురుమనకుండా ఆటోను ఇసుక నుంచి బయటకు తోయడానికి అగచాట్లు పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, బొమ్మనహాళ్)



ఆటో తోస్తున్న కూలీలు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి


గొల్ల శివప్ప (ఫైల్)

గోరంట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచేపల్లిలో గొల్ల శివప్ప (38) అనే రైతు బోరుబావి వద్ద విద్యుదాఘాతానికి గురై శనివారం మృతి చెందాడు. శివప్ప స్వగ్రామం చిలమత్తూరు మండలం మొరంపల్లి. శివప్ప తల్లి పుట్టినిల్లు బూచేపల్లి కావడంతో చిన్నప్పటి నుంచి మేనమామలు నిజమాయలప్ప, రమణ వద్ద ఉంటున్నాడు. ముదిగుబ్బ మండలానికి చెందిన రేణుకతో పదేళ్ల క్రితం వివాహమయింది. వీరికి సంతానం లేరు. ఒక్కటిన్నర ఎకరా పొలంలో బోరువేసుకొని దంపతులు ఇద్దరూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వేరుశనగ సాగు చేయాలని భూమిని దుక్కి చేశాడు. విద్యుత్ స్తంభం వద్ద ఉన్న స్టాటర్ నుంచి సర్వీసు వైరు నేలపై ఉండటంతో కట్టెలపై అమర్చే ప్రయత్నం చేస్తుండగా వైరు తాకడంతో విద్యుత్ షాకికి గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దారుణహత్య

● పాతకక్షలా..? వివాహేతర సంబంధమా..?


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్ఐ లింగన్న

పుట్టపర్తి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంగళమ్మచెరువు గ్రామానికి చెందిన కొత్తకోట నాగేష్ (34) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, బంధువులు తెలిపిన మేరకు.. వెంగళమ్మచెరువుకు చెంది న నాగేష్‌ను శుక్రవారం రాత్రి ఎవరో ద్విచక్రవాహనంలో ఎక్కించుకు వెళ్లారు. బయటకు వెళ్లిన వ్యక్తి ఇం టికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబసభ్యులు శనివారం ఉదయం రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి ఆచూకీ కో సం బంధువులు పోలీసులు గాలిం పు చర్యలు చేపడుతుండగా.. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో అమగొండపాల్యెం రోడ్డు సమీపంలోని మామిడితోటలో మృతదేహం ఉండటాన్ని గమనించిన పశువులు కాపరులు బంధువులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంను రంగంలోకి దింపి విచారణ చేపట్టారు. మృతుడు నాగేష్‌కు భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతడు ట్రాక్టర్ బాడుగలకు తిప్పి జీవనం సాగించేవాడు. 25 ఏళ్ల క్రితం బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామంలో జరిగిన ఓ హత్యకేసుతో వీరి కుటుంబానికి సంబంధం ఉన్నట్లు తెలిసింది. అప్పుడే వీరి కుటుంబం కొత్తకోట గ్రామాన్ని వదిలి వెంగళమ్మచెరువుకు వచ్చి స్థిరపడింది. నాగేష్ హత్యకు పాతకక్షలు ఏమైనా ఉన్నాయా.. లేక వివాహేతర సంబంధం కారణమా అనే కోణాల్లో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

రెండు నాటు తుపాకుల స్వాధీనం

కణేకల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొల్లాపురం-కౌకుంట్ల గ్రామాల మధ్య శనివారం రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. సొల్లాపురం గాలిమరల వద్ద నాటు తుపాకులు ఉండగా అక్కడ పనిచేసే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నాటు తుపాకులు ఎవరివనేవి సమాచారం లేదని, విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

సిగ్నల్ దాటిన రాయచూరు ప్యాసింజర్

● లోకో పైలెట్ సస్పెన్షన్..?

గుంతకల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఓ ప్యాసింజరు రైలు రెడ్ సిగ్నల్‌ను దాటడంతో లోకో పైలెట్‌ను అధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. శనివారం రాయచూరు-గుంతకల్లు ప్యాసింజరు రైలును ఇస్వి స్టేషన్ వద్ద రెడ్ సిగ్నల్‌ను దాటి నిలిపినట్లు సమాచారం. రైల్వే సేఫ్టీ నిబంధనల ప్రకారం రెడ్ సిగ్నల్ ఇచ్చిన చోట ఆ సిగ్నల్‌ను రైలింజన్ ఎట్టి పరిస్థితుల్లో దాటడానికి వీలులేదు. అలా రెడ్ సిగ్నల్‌ను కొంచెం దాటినా సిగ్నల్ పాస్ట్ అట్ డేంజర్ (స్పాడ్) కేసుగా లెక్కించి బాధ్యులైన లోకో పైలెట్, సహాయ లోకో పైలెట్‌పై చర్యలు తీసుకుంటారు. ప్యాసింజరు రైలు సిగ్నల్ దాటిన సంఘటనలో ఎల్పీ హేమంత్ కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

పత్తి రైతు చిత్తు..!

అరకొరగానే దిగుబడులు

పాతాళానికి ధర
నష్టానికి అమ్ముకోలేక ఇళ్లలోనే నిల్వ


గుత్తిలో ఖాళీగా పత్తి కొనుగోలు కేంద్రం

పత్తి రైతులకు ఈసారి కష్టాలు తప్పడం లేదు. సకాలంలో వర్షం పడకపోవడం, తెగుళ్లతో అరకొరగానే దిగుబడి వచ్చింది. ఇదే క్రమంలో బహిరంగ మార్కెట్‌లో ధరలు అమాంతం తగ్గుముఖం పట్టాయి. అరకొర దిగుబడితో నష్టపోయిన రైతులు ధర కూడా తక్కువగా ఉండటంతో మరింత కుదేలవుతున్నారు. ధరలు తక్కువగా ఉండటంతో ఎక్కువమంది ఇళ్లలోనే పత్తి పంటను నిల్వ చేసుకున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం అర్బన్/పామిడి


పామిడి మండలంలో నిల్వ చేసిన పత్తి దిగుబడి

పడిపోయిన ధర

ఖరీఫ్‌లో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 48వేల హెక్టార్లుగా నిర్ణయించారు. జిల్లావ్యాప్తంగా 28వేల హెక్టార్లల్లో మాత్రమే పంట పెట్టారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం తగ్గింది. పెట్టుబడులు పెరగడం, తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి రావడం, మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ధర లేకపోవడం తదితర కారణాలతో పత్తి సాగును రైతులు తగ్గించారు. కొందరు తమ కున్న పొలంలో సగం పత్తి, మిగతా విస్తీర్ణంలో కంది, కొర్ర, పొగాకు తదితర పంటలు పెట్టారు. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఈసారి వర్షాభావ పరిస్థితులతోపాటు గులాబి రంగు తెగులు సోకడంతో పత్తి దిగుబడి తగ్గింది. వర్షా లు సకాలంలో పడితే ఎకరాకు 8 నుంచి 15 క్వింటాళ్లదాకా దిగుబడి వస్తుంది. ఈసారి 4 నుంచి 5 క్వింటాళ్లలోపే వచ్చింది. ధర తక్కువగా ఉండటంతో పత్తి పంటను ఎక్కువమంది రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. ఈసారి పంట సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు, పత్తి దిగుబడి అరకొరగానే వచ్చింది. అయినా ధరపెరగలేదు. కొందరు దళారులు కుమ్మక్కై ధరలు పెరగకుండా చేసి, రైతులను దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూడే ళ్ల క్రితం క్వింటా పత్తి రూ.10వేలు పలికింది. రెండేళ్ల క్రితం క్వింటా నా ణ్యతను బట్టి పత్తి రూ.7వేల నుంచి రూ.8వేలదాకా ఉండింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పత్తి నాణ్యతను బట్టి క్వింటా ధర రూ.5800 నుంచి రూ.6300 దాకా పలుకుతోంది.

మద్దతు ధరతో కొనుగోలులో నిర్లక్ష్యం

పత్తి రైతుకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఏటా గుత్తి, తాడిపత్రి మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఈసారి కేవలం గుత్తి మార్కెట్ యార్డులో గతేడాది డిసెంబరు రెండోవారంనుంచి 25 రోజులపాటు తూతూమంత్రంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోనే సరిపెట్టారు. ఈసారి పత్తి క్వింటా మద్దతు ధర రూ.7561గా ప్రభుత్వం నిర్ణయించింది. 3,300 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయడంతోనే సీసీఐ అధికారులు సరిపెట్టారు. ఎక్కువశాతం పత్తి నాణ్యతగా లేదంటూ రైతులను వెనక్కి పంపినట్లు సమాచారం. ఆదోని, నంద్యాల, బళ్లారి మార్కెట్లకు జిల్లాలోని రైతులు పత్తి ఉత్పత్తిని తీసుకెళ్తున్నారు. అక్కడ క్వింటా పత్తి రూ.6500 పలుకుతున్నట్లు సమాచారం. రవాణా ఖర్చులు అదనంగా రైతుపై పడుతున్నాయి.

సాగు తగ్గించాం



ఏటా 30 ఎకరాల్లో పత్తి పంట సాగు చేసేవాళ్లం. రెండేళ్లుగా గిట్టుబాటు ధర దక్కట్లేదు. పంట సాగు, తెగుళ్ల నివారణకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపో యాయి. దీంతో ఈసారి ఏడెకరాల్లోనే పంట పెట్టా. ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దిగుబడి తగ్గినా గిట్టుబాటు ధర మాత్రం పెరగడం లేదు. దీంతో నష్టపోతున్నాం.

- దేవేంద్రరెడ్డి, రైతు, రామరాజుపల్లి, పామిడి మండలం

ఇంట్లోనే నిల్వ చేసుకున్నాం



బహిరంగ మార్కెట్‌లో ఆశించిన మేర ధర లేకపోవడంతో పత్తి పంటను ఇంట్లోనే నిల్వ చేసుకున్నాం. రెండేళ్లుగా గిట్టుబాటు ధర లేదు. మా గ్రామంలో 2500 క్వింటాళ్ల పత్తిని రైతులు నిల్వ చేసుకున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలి. - రామలింగారెడ్డి, రైతు, గజరాంపల్లి, పామిడి మండలం

క్వింటా రూ.10వేలతో కొనుగోలు చేయాలి



ధరలు తక్కువగా ఉండటంతో రెండేళ్లుగా ఎక్కువమంది రైతులు ఇళ్లలోనే పత్తి దిగుబడులను నిల్వ చేసుకున్నారు. నాణ్యత ప్రమాణాల పేరుతో పత్తి పంటను కొనుగోలు చేయకపోవడం దారుణం. ఈసారి పంట సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడి తగ్గినా ధరలు పెరగకుండా దళారులు కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్నారు. పత్తి క్వింటా రూ.10వేలతో కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● పెళ్లైన నెలరోజులకే మృత్యువాత
● ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలు


దాదాపీర్(ఫైల్)

కదిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పెళ్లి అయిన నెల రోజులకే రోడ్డు ప్రమాదం ఓ యువకుడిని బలిగొంది. ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బస్సు ఢీకొనడంతో యువకుడు మృతి చెందగా.. ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కదిరి మున్సిపాలిటి కుటాగుళ్లలోని పులివెందుల క్రాస్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మోటార్ సైకిల్‌లో వెళుతున్న దాదాపీర్(26) అక్కడికక్కడే మృతి చెందగా.. ఇంటర్ విద్యార్థి సయ్యద్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. కదిరి అడపాల వీధికి చెందిన దాదాపీర్ మడకశిర తపాలా కార్యాలయంలో పనిచేస్తున్నాడు. వరుసకు తమ్ముడైన నిజాం వలీ కాలనీకి చెందిన సయ్యద్ బాషా అనే ఇంటర్ విద్యార్థి స్థానిక బ్లూమూన్ కళాశాలలో పరీక్ష రాస్తున్నాడు. పరీక్ష అనంతరం కళాశాల నుంచి మోటార్ సైకిల్‌పై కదిరికి వస్తున్నారు. ఇదే సమయంలో కదిరి నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు కుటాగుళ్లలోని పులివెందుల క్రాస్ వద్దకు రాగానే మోటర్ సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటార్‌సైకిల్ నడుపుతున్న దాదాపీర్ అక్కడిక్కడే మరణించగా సయ్యద్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. విద్యార్థిని 108 ద్వారా ప్రభుత్వ కదిరి ఆసుపత్రికి చేర్చారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పెళ్లైన నెల రోజులకే..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దాదాపీర్ పోస్టల్ ఉద్యోగి. మడకశిరలో పనిచేస్తున్నాడు. పెళ్లై దాదాపు 40 రోజులయింది. దాదాపీర్ తల్లి, ఇంటర్ విద్యార్థి సయ్యద్ తల్లి అక్క, చెల్లెళ్లు. వరుసకు తమ్ముడైన సయ్యద్‌బాషా ఇంటర్ మొదటి రోజు పరీక్షకు బ్లూమూన్ కళాశాలకు వెళ్లాడు. పరీక్ష రాసిన సయ్యద్‌ను పిలుచుకు వస్తుండగా.. కుటాగుళ్ల వద్దకు జరిగిన ప్రమాదంలో దాదాపీర్ అక్కడిక్కడే మృతి చెందాడు. దాదాపీర్ మరణ వార్త తెలియగానే అతడి భార్య, తల్లి ఇతర బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. శవాన్ని చూసి కన్నీరు, మున్నీరయ్యారు. పెళ్లైన నెలకే భర్త మరణించడంతో ఆమె రోదనలు ఆసుపత్రిలో మిన్నంటాయి. చేతికొచ్చిన కొడుకు ఉన్నట్టుండి చనిపోవడంతో విలపించిన తల్లిదండ్రులను చూసి బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

మొదటి పరీక్ష రాస్తూనే...


గాయపడిన ఇంటర్ విద్యార్థి సయ్యద్ బాషా

స్థానిక స్పేస్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సయ్యద్‌బాషా మొదటి రోజు పరీక్ష రాయడానికి బ్లూమూన్ కళాశాలకు వెళ్లాడు. పరీక్ష రాసి ఇంటికి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి తరలించారు. మొదటిరోజు పరీక్ష రాస్తూనే ప్రమాదం జరగడంపై తల్లిదండ్రుల రోదలనతో ఆసుపత్రి దద్దరిల్లింది.

విద్యా వృక్షం అనంతలక్ష్మి

● విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీనారాయణ
● సాగునీటి సలహాదారు కన్నయ్య నాయుడు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం సెంట్రల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాలో అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల సాంకేతిక విద్యా వృక్షంగా వెలుగొందుతోందని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఫౌండర్ డైరెక్టర్, విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఇరిగేషన్ విభాగం సలహాదారు కన్నయ్య నాయుడు అన్నారు. నగరంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల 17వ వార్షికోత్సవంలో వారు పాల్గొని ప్రసంగించారు. కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. అనంతపురం జేఎన్టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రైతు కుటుంబం నుంచి వచ్చిన అనంతరాముడు పాఠశాల, కళాశాలలను ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. విద్యలో రాశి కాదని, వాసి కూడా కావాలని అన్నారు. విద్యార్థులకు డిగ్రీ ఇచ్చి పంపడం కాదని, నైపుణ్యం పెంచి పంపాలని సూచించారు. లేకుంటే ద్రోహం చేసినవారౌతారని అన్నారు. వరదలు వచ్చినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులే అన్ని పనులు చేయలేరని కన్నయ్య నాయుడు అన్నారు. రైతులు సంఘటితమై, ప్రభుత్వం ఇచ్చే నిధులతో కాలువలను బాగుచేసుకోవాలని సూచించారు. రాయలసీమలోని వ్యాసంపల్లి అనే చిన్నగ్రామంలో తాము ఉండేవారమని, తాను రైతు కుటుంబంలో జన్మించానని తెలిపారు. 1952లో కరువు చూశామని, ఆ సమయంలో బతికేందుకు ఒక గ్లాసు అంబలి ఇచ్చేవారని అన్నారు. తమ పెద్దలు చెప్పిన ప్రకారం 1935 నుంచే కరువు తాండవిస్తోందని, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల నుంచి చాలామంది పొట్ట నింపుకోవడానికి వలస వెళ్లారని గుర్తుచేసుకున్నారు. బెంగళూరు, మద్రాసు వంటి నగరాలకెళ్లి ఇళ్లలో పనిచేసేవారని అన్నారు. ఇంజనీరుగా తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ట్రోఫీలు, ప్రసంశా పత్రాలను అందజేశారు.

నేడు ఉద్యాన శాఖ డైరెక్టర్ పర్యటన

అనంతపురం అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ డైరెక్టర్ దేవమునిరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఫెయిర్‌ట్రాసా కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాట్రిక్ స్ట్రూబి, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి జిల్లాలో అరటి సాగు, ఎగుమతిపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. రాప్తాడు మండలం రామినేపల్లిలో టిష్యూకల్చర్ అరటి ఉత్పత్తిని పరిశీలిస్తారు. పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట, పుట్లూరు మండలం సంజీవపురం, కడవకల్లులో అరటిని పరిశీలిస్తారు. తాడిపత్రి మండలం చుక్కలూరులో కోల్డ్ స్టోరేజీని పరిశీలించనున్నారు.

మన్నీల గ్రామ సమీపంలో సాగులో ఉన్న చీనీ, బెండ, దానిమ్మ పంటలు



కరెంటు కట..కట..!

ఆ గ్రామాల్లో సాగునీరు పుష్కలం. చెరువులు నీటితో నిండుగా ఉన్నాయి. భూగర్భ జలాలకు ఇబ్బంది లేదు. బోర్లలో మునుపటి కంటే ప్రస్తుతం నీటి లభ్యత ఆశాజనకంగా ఉంది. అంతా బాగున్నా.. పంటలకు నీరందించేందుకు కరెంటు కష్టాలు వెంటాడుతున్నాయి. ఇన్నాళ్లు బోర్లలో నీటి కోసం అవస్థలు పడుతూనే.. పంటలను బతికించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం నీటి తిప్పలు లేకున్నా.. కరెంటు కష్టాలు రైతులను కలవర పరుస్తున్నాయి. కొన్ని రోజులుగా మండలంలోని ఆకుతోటపల్లి వ్యవసాయ ఫీడర్‌లో నిత్యం అంతరాయాలు ఏర్పడుతుండడంతో పంటలకు నీరందించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. - ఆంధ్రజ్యోతి, అనంతపురంరూరల్

ఆకుతోటపల్లి ఫీడర్‌లో నిత్యం అంతరాయాలు

వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు
పంటకు నీరందించేందుకు అన్నదాతల అవస్థలు

నిత్యం అంతరాయాలే..

ఆకుతోటపల్లి వ్యవసాయ ఫీడర్ పరిధిలోకి మన్నీల, కందుకూరు గ్రామాలు వస్తాయి. మన్నీల పరిధిలో 400, కందుకూరు పరిధిలో 200 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికింద 8 వేల ఎకరాల్లో పంట లు సాగులో ఉన్నాయి. అందులోనూ ఉద్యా న పంటలే అధికం. వెయ్యి ఎకరాల్లో దాని మ్మ, చీనీ, ద్రాక్ష, అరటి వంటి పంటలు సాగు చేశారు. వ్యవసాయానికి కరెంటు సరఫరా సమయంలో లోడ్ ఎక్కువై నిత్యం సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. తరచూ జంపర్లు తెగిపోతుండటం, ట్రాన్స్‌ఫార్మర్ల హెడ్ ఫీజులు కాలిపోవడం, ఓల్టేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ఫీడర్ 35 నుంచి 40 కిలోమీటర్లు ఉండ టం కారణంగా జంపర్లు ఎక్కడ తెగిపోయాయో తెలుసుకోవడానికి లైన్ మొత్తం పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరమ్మతులు చేసి.. విద్యుత్ సరఫరా పునరుద్ధరించే సరికి గంటల సమయం పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో రోజూ రెండు, మూడు గంటలు పంటకు నీరందించేందుకు వీలులేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం చీనీ, దానిమ్మ పంటలు కాపు దశలో ఉన్నాయి. చాలినంత నీరు ఇవ్వకపోతే దిగుబడులపై ప్రభావం పడుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అదనపు ఖర్చులతో మరింత నష్టం..

కరెంటు సరఫరాలో సమస్యలతో అదనపు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉన్నఫళంగా కరెంటు పోవడం.. రావడంతోపాటు ఓల్టేజీ సమస్యలతో మోటార్లు కాలిపోతున్నాయి. స్టార్టర్ పెట్టెలో వైర్లు, మోటార్ల విద్యుత్ తీగలు కాలిపోవడం నిత్యకృత్యంగా మారాయి. పదిహేనురోజుల్లో వందకుపైగా మోటార్లు కాలిపోయినట్లు తెలుస్తోంది. బోరుబోవుల్లోని మోటార్లు బయటకు తీసి, మరమ్మతులు చేసి.. మళ్లీ లోపలికి దింపాలంటే వేల రూపాయల ఖర్చుతో కూడుకున్న పని. మోటారు వైండింగ్, రవాణా ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఒకసారి మోటారు సమస్య తలెత్తితే.. మరమ్మతులకు రూ.10వేలకుపైగా ఖర్చవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జంపర్లు తెగిపోతే.. రోజంతా కరెంటు లేనట్లే



అరెకరాలో అరటి, నాలుగెకరాల్లో చీనీ, రెండెకరాల్లో పశుగ్రాసం సాగు చేశా. కరెంటు సమస్య తీవ్రమైంది. లోడ్ ఎక్కువైపోయి జంపర్లు తెగిపోతున్నాయి. వాటికి మరమ్మతులు చేసి, తిరిగి అమర్చే సరికి ఆ రోజంతా వృథా అవుతోంది. దీంతో పంటలకు నీరివ్వలేని పరిస్థితి తలెత్తుతోంది. సబ్‌స్టేషన్ కోసం ఎన్నోసార్లు అధికారులకు విన్నవించాం. స్థలం లేదంటూ అధికారులు దాటవేస్తున్నారు. - సీవీ కొండయ్య, రైతు, మన్నీల గ్రామం

సబ్‌స్టేషన్ కోసం ఎదురుచూపు



విద్యుత్ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్ ఏర్పాటు ఒక్కటే మార్గం అన్న అభిప్రాయాలు ఆయా గ్రామస్థులు, రైతుల నుంచి విపిస్తున్నాయి. కొన్నేళ్లుగా సబ్‌స్టేషన్ కోసం రైతులు.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సబ్ స్టేషన్ మంజూరైనట్లు సమాచారం. స్థలం చూపితే సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడతామని విద్యుత్ అధికారులు అంటున్నట్లు రైతులు చెబుతున్నారు. గ్రామ పరిధిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు తగినంత ప్రభుత్వ స్థలం లేకపోవడం సమస్యగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చొరవ చూపాలని రైతులు అంటున్నారు.

పంటలపై ప్రభావం: బయన్న, రైతు, మన్నీల గ్రామం



ఐదెకరాల్లో చీనీ, దానిమ్మ పంటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయి. లక్షలు పెట్టుబడి రూపంలో పెట్టా. ఇలాంటి సమయంలో కరెంటు అంతరాయాలు ఆందోళన రేపుతున్నాయి. కరెంటు ఎప్పుడొనుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. దీంతో పంటలకు సక్రమంగా నీరివ్వలేకపోతున్నాం.

న్యూస్ బాక్స్

క్లస్టర్ ఏర్పాటుకు స్థల పరిశీలన



క్లస్టర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

ధర్మవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.35కోట్ల వ్యయంతో మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు మార్కెట్‌యార్డ్‌లోని స్థలాన్ని ఆర్డీఓ మహేశ్, హ్యాండ్‌లూమ్ జేడీ రామారావు పరిశీలించారు. శనివారం అధికారులు స్థల పరిశీలనచేసి ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని ప్రణాళికలను సమీక్షించారు. ఎన్నికల సమయంలో ధర్మవరానికి మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆ హామీని నెరవేర్చేవిధంగా అడుగులు వేస్తున్నారు. జూలైలో క్లస్టర్ ఏర్పాటుకు కేంద్ర జౌళికశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ని కలిసి ధర్మవరంలో చేనేతరంగం అభివృద్ధికి మెగా క్లస్టర్ ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. ఈ క్రమంలో ఇప్పుడు హ్యాండ్‌లూమ్ జేడీ స్థల పరిశీలనకు ధర్మవరంకు రావడంతో చేనేతల కలలు త్వరలోనే సాకారమవ్వనున్నాయని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు అన్నారు. అధికారుల వెంట తహసీల్దార్ నటరాజ్, చేనేత నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నల్లచెరువు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం అంగనవాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. 1 నుంచి 8వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి తెలిపారు. బేటీ బచావ్ బేటీ పడావ్, ఇంటికి దీపం ఇల్లాలు, మహిళ ఒక చైతన్య కీర్తి, అమ్మాయి చదువు అభివృద్ధికి సూచికలు, స్త్రీలేకపోతే సృష్టిలేదు, స్త్రీ అంటే శక్తి, స్త్రీ అంటే ప్రకృతి అన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రఫీవున్నీసా, లక్ష్మీదేవమ్మ, పద్మావతి, జయమ్మ, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథగుప్త తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికిపూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ధర్మవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మార్పీఎస్ నాయకులు నరేంద్రబాబు, ఉపాధ్యక్షుడు సిరిడిబాదెప్ప ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీవర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించి నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సాకే నాగరాజు, నాయకులు నారాయణ, సుధాకర్, తాడిమర్రి రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, పూజారిపెద్దన్న, రామకృష్ణ, నరసింహులు, నల్లప్ప, రామాంజి పాల్గొన్నారు.

ఘనంగా చైతన్య పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే

కదిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు టెక్నాలజీ పరంగా అద్భుత ఆలోచనలు కలిగి ఉన్నారని అన్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగా శ్రీచైతన్య పాఠశాలలో పాఠ్య ప్రణాళికతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉందని అన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 21 బ్రాంచ్‌లు ఉన్నాయని అన్నారు. కదిరి పురప్రజల సహకారంతో పాఠశాలను విజయవంతంగా నడుపుతున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్స్ శ్రీనివాసరెడ్డి ,సమీనాఖాన్, విశ్వనాథ్, తిరుమలేష్‌రెడ్డి, డీన్ హరినారాయణ, ప్రైమరీ ఇన్‌చార్జ్ అనిత, సబిత, లక్ష్మీనారాయణ, అమ్మాజాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మా భూములు ఎక్కడికెళ్లాయో తేల్చండి

● తహసీల్దార్‌కు రైతుల వినతి

తాడిమర్రి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మా భూముల వివరాలు ఆన్‌లైన్‌లో లేకుండా ఎక్కడికెళ్లాయో తేల్చాలని రామాపురం గ్రామానికి చెందినరైతులు తహసీల్దార్ భాస్కరరెడ్డిని కోరారు. గ్రామ సర్పంచ్ పుల్లయ్య ఆధ్వర్యంలో వీరనారప్ప, కుళ్లాయప్ప, నారాయణస్వామి, ప్రదీ ప్ తదితరులు తహసీల్దార్‌ను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. రెండేళ్లక్రితం జరిగిన రీసర్వే మూలంగా ఒకరి భూములు మరొకరికి మారాయన్నారు. అసలు భూములే లేకుండా పోయాయని వాయపోయారు. నాలుగునెలల క్రితం ఇదే విషయం దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లో భూములే లేకుండా పోయాయని, వెంటనే వాటిని నమోదు చేసి ఆదుకోవాలని రైతులు విన్నవించారు.

డిగ్రీ కళాశాల పూర్తయ్యేనా..?

● ఏడేళ్లగా ఎక్కడవేసిన గొంగళి అక్కడే..
● పట్టించుకోని ఉన్నత విద్యాశాఖ
● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



శిథిలావస్థకు చేరుకున్న బుక్కపట్నం డిగ్రీ కళాశాల భవనం

బుక్కపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం ఎప్పుడు పూర్తవుతుందోనని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఏడు సంవత్సరాలుగా భవన నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. నిర్మాణం పూర్తవ్వడానికి మరో ఏడేళ్లు పడుతుందేమోనని విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ పనులను ప్రారంభమయ్యాయి. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్మాణ పనులను కొనసాగించకుండా గాలికి వదిలేసింది. రూ.3కోట్ల వ్యయంతో పనులు ప్రారంభం కాగా రూ.1.15కోట్ల పనులు జరిగాయి. ప్రస్తుతానికి రూ.96 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 39 శాతం పనులు పూర్తయ్యాయి. బుక్కపట్నంలో నెలకొల్పిన డిగ్రీకళాశాలలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ, ముదిగుబ్బ, సీకేపల్లి, గోరంట్ల, అమడగూరు, ఓడీసీ మండలాల విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. ఇంత ప్రాధాన్యం ఉన్న కళాశాలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. ఈ భవనాన్ని ఇలాగే వదిలేస్తే కూలిపోయే ప్రమాదం ఉందని, దీనికితోడు గ్రామం బయట ఎటువంటి జనసంచారం లేనిచోట ఉండటంతో అసాంఘిక శక్తులకు నిలయంగా మారిందని స్థానికులు అంటున్నారు. దీనికితోడు భవనంలో పనికివచ్చే వస్తువులు చోరీకి గురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని త్వరగా కళాశాల భవనాన్ని పూర్తి చేయాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

ఇన్నేళ్లుగా హైస్కూల్ భవనంలోనే..: స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలోనే కొన్ని సంవత్సరాలుగా డిగ్రీ విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నారు. గతంలో బీఏ, బీకాం గ్రూపులు నిర్వహిస్తుండగా ప్రస్తుతం బీఎస్సీని ప్రారంభించారు. 197 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి కేవలం ఏడు గదులు మాత్రమే కేటాయించగా అందులో ఒక గది ల్యాబ్, ఒక గది స్కిల్ హబ్‌లకు కేటాయించారు. మిగిలిన ఐదు గదులు మాత్రం తరగతులు నిర్వహించడానికి కేటాయించారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రారంభానికి ముందే శిథిలావస్థకు..: అరకొరగా కళాశాల నిర్మాణాన్ని చేపట్టి మధ్యలోనే పనులు ఆపివేశారు. దీంతో నిర్మాణ నాణ్యత దెబ్బతింటోంది. మూడు అంతస్తులకు పిల్లర్లు వేసి స్లాబులు వరకు నిర్మించి వదిలేశారు. దీంతో ఎండ, గాలి, వానకు ఇది పాడుబడ్డ భవనంగా దర్శనమిస్తోంది.

అరకొరగదుల్లో ఇబ్బందులుపడుతున్నాం



అరకొర, ఇరుకు గదుల్లో విద్యను అభ్యసించడానికి ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే ప్రభుత్వం నిధులు కేటాయించి త్వరగా నూతన భవనం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి. విద్యాశాఖ అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- ఓబుళేశు, విద్యార్థి

ఆకట్టుకున్న ప్రేమవాహిని నృత్యరూపకం



నృత్యం చేస్తున్న బాలవికాస్ చిన్నారులు

పుట్టపర్తి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ బాలవికాస్ చిన్నారులు ప్రేమ వాహిని సంగీత నృత్యంతో భక్తులను అలరింపచేశారు. శనివారం ఉమ్మడి అదిలాబాద్ జిల్లా భక్తులు పర్తియాత్ర పేరుతో ప్రశాంతినిలయానికి చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి ప్రేమతత్వంపై ప్రేమవాహిని, సంగీత నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. బాలవికాస్ చిన్నారులు భక్తిపాటలు, నృత్య రూపకంతో భక్తులను తన్మయం చేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



సరస్వతి పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కదిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతి పూజను విద్యార్థినులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు మార్చి 17 నుంచి పరీక్షలు రాయనున్నారు. పాఠశాల అవరణలో ఉన్న సరస్వతి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. మీటింగ్ హాల్‌లో ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం, ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుళరెడ్డి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు ఏవిధంగా రాయలో, పరీక్ష కేంద్రంలో చేయాల్సిన పనులు, చేయకూడని పనులు, పరీక్ష రాసేటప్పుడు విద్యార్థులు చేసే తప్పులను వివరించారు.

గాండ్లపెంట: పదో తరగతి విద్యార్థులు మునగలవారిపల్లి గరుడాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు శనివారం నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు హాల్‌టికెట్‌లను స్వామి ముందు ఉంచి పరీక్షల్లో మంచి మార్కులు రావాలని ప్రార్థించారు. అనంతరం స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు. హెచ్‌ఎంలు మల్లికార్జున, మహేష్, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ

ధర్మవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 40వ వార్డుల్లో 95 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. వార్డులలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. 23వ వార్డులో కమిషనర్ పింఛన్లను స్వయంగా పంపిణీచేశారు. టీపీఓ పెనుబోలు భాస్కర్‌రాయల్, టీడీపీ 23వ వార్డు ఇన్‌చార్జ్ అడ్రమహేశ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

నల్లచెరువు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పాలపాటిదిన్నె అంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలేకాక సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఉదయం పాలాభిషేకంతో ప్రారంభమై మధ్యాహ్నం కోర్కెల నివారణ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తాగునీటి సమస్య రానివ్వకండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ యాదవ్

ముదిగుబ్బ, మార్చి1(ఆంధ్రజ్యోతి):గ్రామాలలో తాగునీటి సమస్య రానివ్వొద్దని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, రేషన్ డీలర్లకు బియ్యం తక్కువగా అందుతున్నాయని, పలు సమస్యలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బస్టాండ్ కబరస్థాన్, పాతూరు కబరస్థాన్‌కు ప్రహరీ నిర్మించాలని కోఆప్షన్ నెంబర్ చిన్నబాలముని ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీవో దివాకర్, మండల అధికారులు, వైస్ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే స్వావలంబన: కలెక్టర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే స్వావలంబన సాధ్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వారోత్సవాల సందర్భంగా జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారత, ఆర్థిక, సాంస్కృతిక విజయాలను గుర్తించి గౌరవించాలన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా వనరులు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు అవకాశాలు కల్పించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళాదినోత్సవ వారోత్సవాలు మార్చి 1నుండి 8వతేదీ వరకు జరుగుతాయన్నారు. ర్యాలీ గణేష్ కూడలి వరకు కొనసాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ప్రతిఒక్కరూ బాలికా విద్యను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం, సీడీపీఓ గాయత్రి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పించాలి



ధర్మవరంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, ఎక్సైజ్‌శాఖ అధికారులు

పుట్టపర్తి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన, గ్రామీణప్రాంతాలలో నాటుసారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆర్డీఓ సువర్ణ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో నషాప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలన కార్యక్రమం నవోదయం 2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ, ఎక్సైజ్‌శాఖ ఈఎస్ నరసింహులు మాట్లాడుతూ నాటుసారా నిర్మూలన లక్ష్యంగా పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అటవీ, రెవెన్యూశాఖలు సంయుక్తంగా ప్రజల్లోకి వెళ్లి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పుట్టపర్తి నల్లమాడ, తహసీల్దార్లు డీపీఓ ఆఫీస్ ఏఓ, ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, నల్లమాడ సీఐ, బుక్కపట్నం ఎస్‌ఐ పాల్గొన్నారు.

ధర్మవరం: నాటుసారా రహితంగా మార్చడమే నవోదయ 2.0లక్ష్యమని ఆర్డీఓ మహేశ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం నవోదయ 2.0కు సంబంధించిన పోస్టర్లను ఆర్డీఓతో పాటు ఎక్సైజ్‌శాఖ అధికారులు ఆవిష్కరించారు. వారు ఏపీని నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం నవోదయ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఎక్సైజ్ అధికారులు గోవిందనాయక్, శ్రీరామ్, చంద్రమణి, ఫరూక్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

ధర్మవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం మొదటి రోజు ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. ఆరు కేంద్రాలలో తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలకు 1835 మంది విద్యార్థులు పరీక్షలురాయాల్సి ఉండగా 1785 మంది రాశారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం మొదలయ్యాయి. ఉదయం 8:30 గంటలకే విద్యార్థులను పరీక్ష గదులలోకి పంపారు. ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ రిజ్వానా, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ సనావుల్లా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

నల్లమాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగినట్లు ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ తెలిపారు. 140మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 139మంది హాజరయ్యారన్నారు. తహసీల్దార్ రంగనాయకులు, సీఐ నరేంద్రరెడ్డి కేంద్రాలను పరిశీలించారు.



ధర్మవరంలో కళాశాల వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

రాష్ట్ర బడ్జెట్ వైసీపీకి చెంపపెట్టు

● ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆయన బృందానికి, వైసీపీకి చెంపపెట్టని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరమే అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి తల్లి వందనం ఇస్తున్నట్లు చెప్పారు. అందుకు తగ్గట్టుగా బడ్జెట్ రూ.9000 కోట్లు కేటాయించారని అన్నారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ దీన్ని కూడా ఓర్వలేక విమర్శిస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని కోట్లు కేటాయించారో ముందు తెలపాలన్నారు. ఎన్నిసంవత్సరాలు ఇచ్చారో ప్రజలకు చెప్పాలన్నారు. హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ పథకాలు అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ కింద రూ.26 కోట్లు విడుదల అయ్యాయని అన్నారు. గాండ్లపెంటకు హంద్రీనీవా నీటిని తీసుకరావడానికి రూ.46 కోట్లతో జీవో మంజూరు చేయించమన్నారు. మరో క్యాంటీన్‌కు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ప్రణాళికలు పంపమని సూచించినట్లు తెలిపారు. తిరువీధులు అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వేయడానికి అన్ని అనుమతులు మంజూరు అయ్యాయని అన్నారు.

ఫించన్ల పంపిణీ: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సామాజిక భద్రత పింఛన్లు ఎమ్మెల్యే శనివారం పట్టణంలో 29, 30 వార్డుల్లో పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతినెలా 1వ తేదీనే ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందిస్తోందన్నారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్, నాయకులు మేకల రమణ, కౌన్సిలర్ అల్బా ముస్తఫా, డైమండ్ ఇర్ఫాన్, నాగప్ప, దాదెం రాజశేఖర్‌రెడ్డి, గంగారత్నమ్మ, పీట్ల రమణమ్మ పాల్గొన్నారు.

నిత్యాసవర సరుకులు సక్రమంగా అందిస్తాం

నంబులపూలకుంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సక్రమంగా నిత్యావసర సరుకులు అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దేవేంద్రనాయక్ తెలిపారు. మండలంలోని గౌకనపల్లి గ్రామంలో ఎండీయూ వాహనం ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీచేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా రేషన్‌సరుకులు తీసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని, చౌకధాన్య డిపోలకు వెళ్లలేనివారికి ఎండీయూ వాహనం ద్వారా అందేలా చూడాల్సిన బాధ్యత వాహనదారులదేనన్నారు. ఎఫ్‌పీ షాపుల వారు కూడా నిత్యావసర సరుకుల తూకాలు సక్రమంగా అందించాలన్నారు.

తాడిమర్రి: చౌకదాన్యపు డిపోల ద్వారా పేదలకు అందిస్తున్న సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని డీఎస్‌ఓ వంశీక్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం తాడిమర్రి తహసీల్దార్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్లకు పలు సూచనలు అందజేశారు. తహసీల్దార్ భాస్కరరెడ్డి, సీఎస్‌డీటీ శారదాంబ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ముదిగుబ్బ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా కాలనీ సమీపంలో శనివారం రాత్రి ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో, ముదిగుబ్బ సీఐ శివరాముడు తన సిబ్బందితో పేకాటస్థావరంపై దాడులు చేసి రూ.2,10,080 నగదు, 8 సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకొని 8మందిని అరెస్టు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో పేకాట, జూదం తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం తనిఖీ



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న చేస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలపల్లిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. శనివారం గ్రామంలో పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు జ్యోత్స్న, వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న ఎన్సీడీ, సీడీ స్క్రీనింగ్ వైద్యపరీక్షలను డీఎంహెచ్‌ఓ తనిఖీచేసి వివరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పేదప్రజలకు వైద్యసౌకర్యం ఇంటివద్దకే అందించాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. సూపర్వైజర్ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ సత్యమ్మ, హెల్త్ అసిస్టెంటు శివ, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కూలి రేట్ల పెంపుపై హర్షం

బుక్కపట్నం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సివిల్‌సప్లై హమాలీ కూలిరేట్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబరు 14 జారీచేయడం పట్ల శనివారం హమాలీలు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని సివిల్‌సప్లై గోదాములో సీఐటీయూ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఈఎస్ వెంకటేశ్ మాట్లాడుతూ 2024లోనే కూలిరేట్లు పెరగాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం కాలయాపన చేసిందన్నారు. సీఐటీయూ అనుబంధ సంఘాల రాష్ట్ర వ్యాప్తంగా చేసిన పోరాటాలకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. సీఎస్‌డీటీ పరిమళ, సివిల్‌సప్లై యూనియన్ నాయకులు రామదాసు, ముత్యాలు, సుబ్రహ్మణ్యం, రామాంజి, శివ, అక్బర్, మోమిన్‌గౌస్, నజీర్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

ముదిగుబ్బ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, శనివారం బీసీ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్‌కు వినతిపత్రం అందించారు. పాఠశాలలో 450 మంది బాలికలు ఉన్నారని, మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రహరీ ఎత్తు తక్కువ ఉండడంతో పందులు గోడ దూకి ఆవరణలోకి వస్తున్నాయని, గోడ ఎత్తు పెంచాలని, వినతిలో పేర్కొన్నారు. నారాయణస్వామి, రాఘవేంద్ర, నగేష్ పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని కార్యదర్శి



11గంటలైనా తెరుచుకోని సచివాలయం

నల్లచెరువు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయం-2లో పం చాయతీ కార్యదర్శి సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ప డుతున్నారు. శనివారం 11 గంటలైనా సచివాలయం తా ళాలు తీయకపోవడంతో వివిధ పనులపై వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యదర్శి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉండగా సొంత పనులకే ఎక్కువ సమయం కేటాయించి ఇష్టమొచ్చినప్పుడు కార్యాలయానికి వస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. గతంలో పత్రికల్లో సైతం వచ్చినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అతనిలో మార్పు రాలేదని ప్రజలు అంటున్నారు. అతని ప్రవర్తనవల్ల కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కూడా ఆలస్యంగా వస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

శ్రీకైలాస క్షేత్రానికి బస్సు ప్రారంభం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న పీఠాధిపతి

పెనుకొండ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీకైలాసం వెళ్లడానికి భక్తులకు మార్గం సుగమమైంది. పెనుకొండ సమీపంలోని గొందిపల్లివద్ద కొండ కోనల్లోని ఈ క్షేత్రానికి బస్సు సౌకర్యం ఏర్పాటుచేశారు. శ్రీకైలాస క్షేత్రంలో శనివారం ఆలయ పీఠాధిపతి తిరుపతి స్వామి, ఆర్టీసీ అధికారులు, చుట్టుపక్కల గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి బస్సును ప్రారంభించారు. గతంలో ఆగిపోయిన బస్సును తిరిగి ప్రారంభించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకైలాస క్షేత్రానికి నందమూరి తారకరామారావుకు ప్రత్యేక అనుబంధం ఉండేది. అప్పట్లో పీఠాధిపతి తిరుపతిస్వామి అభ్యర్థన మేరకు అక్కడికి ప్రత్యేక బస్సును ఏర్పాటుచేశారు. ప్రయాణికుల రద్దీ తగ్గడంతో బస్సులను నిలిపివేశారు. దీంతో బస్సు సౌకర్యం కల్పించి పునర్వైభవం తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. ఆయన ఆదేశాలతో ప్రతిరోజూ పెనుకొండ నుంచి కియా, గొందిపల్లి, శ్రీకైలాసం మీదుగా ధర్మవరంకు ప్రత్యేక ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. దీనిపై చుట్టుపక్కల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు

అంధ విద్యార్థులకు పండ్ల పంపిణీ

పరిగి, మార్చి1(ఆంధ్రజ్యోతి):సేవామందిరంలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు శనివారం హిందూపురం భాష్యం విద్యాసంస్థల యజమాని రామక్రిష్ణ పండ్లు, తినుబండారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి జన్మదిన కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్, హెచ్‌ఎం సల్మాబాను, అనసూయమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెనుకొండ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుట్టూరు జెడ్పీహైస్కూల్‌లో శనివారం సరస్వతిపూజ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో టెన్త్ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ముగిసిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు



శివపార్వతులకు వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు ఉత్సవాలను లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, నిర్వహించారు. వసంతోత్సవ కార్యక్రమాన్ని ఆలయం నాట్యమండపంలో కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం శయనోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి శివరాత్రి వేడుకలను ముగించారు. వేడుకలను వైభవంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ కృతజ్ఞతలు తెలిపారు.

హోంమంత్రి దృష్టికి అగళి సమస్యలు

అగళి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి):అగళి సమస్యలను జెడ్పీటీసీ ఉమేష్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె అనంతపురం జిల్లాలో పర్యటించిన నేపథ్యంలో ఎమ్మెల్యే రాజు స్వగృహంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగళి మండలం కర్నాటక సరిహద్దులో ఉందని వివిధ సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. స్టేషన్‌లో సిబ్బంది కొరత, పూర్తిస్థాయిలో ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఉమేష్ కన్వీనర్ కుమార్‌స్వామి, నాయకులు ఫైనాన్స్ నారాయణప్ప, జయన్న, తిప్పేస్వామి, నరసింహ మూర్తి, మంజుచరణ్, వీరన్న, టీపోడి రాజన్న, కృష్ణారెడ్డి, సురేష్, చంద్రప్ప, నాయకులు పాల్గొన్నారు.

ఈ - ఖాతా అభియాన్‌కు శ్రీకారం



ఈ-ఖాతా పుస్తకాలను అందజేస్తున్న మునిసిపల్ అధ్యక్షుడు

పావగడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఖాతాలకు ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్, మునిసిపల్ అధ్యక్షుడు రాజేష్ శనివారం శ్రీకారం చుట్టారు. తాలూకా వ్యాప్తంగా ఇప్పటి వరకు 50 మంది ఏ ఖాతాలు కోసం దరఖాస్తు చేసుకోగా అందులో 15సిద్ధం చేశామని, అదేవిధంగా బీ ఖాతాల కోసం 600 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నియమానుసారం ఈ ఖాతాలను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ అధ్యక్షులు రాజేష్ తెలిపారు. ఏ ఖాతాలు, బీ ఖాతాలపై సమస్యలు, సందేహాలు ఉన్నవారు మునిసిపల్ ముఖ్య అధికారితో చర్చించి తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

ఇక వాహనదారులపై కొరడా!

● అమలులోకి వచ్చిన నూతన వాహన చట్టం

● నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ

హిందూపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వాహన చోదకులు ఇకపై ఎలర్ట్‌గా ఉండాల్సిందే. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వాహన చట్టం శనివారం నుంచి అమలులోకి రావడమే ఇందుకు కారణం. నిబంధనలు ఉల్లంఘించి అధికారులకు పట్టుబడితే భారీ జరిమానాలు కట్టాల్సిందే. కొత్త వాహనం చట్టం కఠినంగా ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనం నడిపే వ్యక్తి, లేదా యజమానికి కష్టమొచ్చినట్లే. కొత్త వాహన చట్టంపై అవగాహన తెచ్చుకుని వాహనాలు నడపాల్సి ఉంటుంది. లేదంటే కొన్ని సందర్భాల్లో జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. కొత్త చట్టం కేవలం జేబులకే చిల్లుపడే విధంగా కాకుండా ఏకంగా బ్యాంక్ ఖాతాలకే ఎసరుపెట్టే ప్రమాదం ఉంది. గతంతో పోల్చితే ఏకంగా పదిరెట్లు జరిమానాలు కట్టాల్సి ఉంటుంది. ఉదాహరణకు ద్విచక్రవాహనంపై ప్రయాణించేవారిలో చోదకుడు ఒక్కడే గతంలో హెల్మెట్ ధరిస్తే సరిపోయేది. ఇప్పుడలాకాదు.. వెనుక కూర్చున్నవారు సైతం హెల్మెట్ పెట్టాల్సిందే. కారులో ప్రయాణించేవారికి సంబంధించి సీటుబెల్టు విషయంలో కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. కొత్త నిబంధనలపై ఇప్పటికే పోలీసులు అవగాహన కల్పించారు, నూతన వాహన చట్టాల నిబంధనలు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. చట్టం పక్కాగా అమలు చేసేందుకు పోలీసులు సన్నద్ధం అవుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, బీమా, వాహనసామర్థ్యం వంటి పత్రాలు వెంట పెట్టుకోవాల్సిందే.

హెల్మెట్ ధరించకపోతే

ఇకపై హెల్మెట్ ధరించకుంటే రూ.వెయ్యి జరిమానా పడుతుంది. వాహనం నడిపేవారే కాకుండా వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ పెట్టుకోకపోతే అంతే మొత్తం జరిమానా చెల్లించాల్సిందే. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిపై రూ.వెయ్యివేటు తప్పదు. బీమాపత్రం లేకపోతే మొదటిసారి రూ.2వేలు, రెండోసారి పట్టుబడితే రూ.4వేలు, కాలుష్య నియంత్రణ పత్రం లేకపోతే రూ.1500, ప్రమాదకర డ్రైవింగ్ తొలితప్పిదంగా రూ.1500, రెండోసారి పట్టుబడితే రూ.10వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. యూనిఫాం లేకుండా ఆటో నడిపినా, నంబరుప్లేటు సరిగాలేకపోయినా, పత్రాలు లేకపోయినా మొదటిసారి 150, రెండోసారి రూ.300, తనిఖీ అధికారి విధులను అడ్డగిస్తే రూ.750, సీటుబెల్ట్ ధరించకపోతే డ్రైవర్‌కు రూ.వెయ్యి, ప్రయాణికులకు రూ.వెయ్యి. వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుంటే, రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయించకపోయినా, వాహనసామర్థ్యం పత్రం లేకపోతే మొదటిసారి రూ.2వేలు, రెండోసారి రూ.5వేలు సమర్పించుకోవాల్సిందే. బైక్ రేసింగ్‌లో దొరికితే మొదటిసారి రూ.5వేలు, రెండోసారి రూ.10వేలు జరిమానా పడుతుంది. అతివేగంగా వాహనం నడిపితే రూ.వెయ్యి, త్రిబుల్ రైడింగ్‌కు రూ.వెయ్యి జరిమానా ఉంటుంది.

ఇకపై నిబంధనలు కఠినతరం

కేంద్రం తీసుకొచ్చిన నూతన వాహన చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే భారీ జరిమానాలు విధిస్తాం. ఇప్పటికే దీనిపై వాహన చోదకులకు అవగాహన కల్పించాం. ఇకమీదట నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వాహనం నడిపినా కొత్తచట్టం ప్రకారం జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది.

\- అంజనేయులు, అప్‌గ్రేడ్ సీఐ

కొత్త వడ్డింపులు ఇలా...

- హెల్మెట్ ధరించకుంటే రూ.వెయ్యి
- డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిపై రూ.వెయ్యి
- బీమాపత్రం లేకపోతే రూ.2వేలు,
- కాలుష్య నియంత్రణ పత్రం లేకపోతే రూ.1500
- వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుంటే రూ.2వేలు

విలువలతో కూడిన విద్యాబోధన అవసరం

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మంత్రిని సత్కరిస్తున్న ఛైర్మన్ దంపతులు

పెనుకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతోకూడిన చదువు ఎంతో అవసరమని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. స్థానిక ప్రగతి గ్లోబుల్‌జెన్, సీబీఎస్‌ఈ పాఠశాల 38వ వార్షికోత్సవ సంబరాలను శనివారం రాత్రి గ్లోబుల్‌జెన్ విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఉదయం డిప్యూటీ డీఈఓ పద్మప్రియ, ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్, తదితరులు హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, షిర్డీసాయి గ్లోబల్‌ట్రస్ట్ ఛైర్మన్ శిల్ప, డీఎస్పీ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ఎంతో అవసరమన్నారు. చదువుతోపాటు సంస్కారం కూడా నేర్పించాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో ఛైర్మన్ శ్రీనివాసులు, సతీమణి మంజుళ కృషి, పట్టుదల ఎంతో ఉందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అతిథులను గ్లోబుల్‌జెన్ ఛైర్మన్ శ్రీనివాసులు, దంపతులు ఉపాధ్యాయులు శాలువకప్పి మొమెంటోలతో సత్కరించారు. తల్లికి వందనం పథకాన్ని ఇంటిలో ఎంతమంది విద్యార్థులున్నా అందరికీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అందిస్తామన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పురం పరీక్షా కేంద్రం లోనికి వెళ్లడానికి క్యూలో ఉన్న విద్యార్థులు

హిందూపురం, పెనుకొండ, మడకశిర, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం కోలాహలంగాప్రారంభమయ్యాయి. ఉదయాన్నే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హడావుడి కనిపించింది. కేంద్రాల్లో నంబర్లు చూసుకోవడానికి విద్యార్థులు ఎగబడ్డారు. ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్షాకేంద్రానికి అనుమతించమని ఇంటర్‌బోర్డు హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో విద్యార్థులు తల్లిదండ్రులను వెంటబెట్టుకుని వచ్చారు. పెనుకొండ పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో శనివారం ఇంటర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మడకశిర నియోజకవర్గంలో 7 సెంటర్‌లను ఏర్పాటు చేయగా అందులో 2165 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. అగళి మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్పించాలి

● హోం మంత్రికి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వినతి

మడకశిర టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి):వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు శనివారం మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఇతర నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఆమె అనంతపురం పర్యటన సందర్భంగా మడకశిర ఎమ్మెల్యే, ఇతర వాల్మీకి సంఘం నాయకులు ఆమెను కలసి వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. సమస్యపై మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, కూటమి ప్రభుత్వంలో వాల్మీకుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం ముఖ్యమంత్రితో చర్చించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే సతీమణీ ఉమాదేవి, అనంతపురం జిల్లా అధ్యక్షులు క్రాంతికుమార్‌తోపాటు మడకశిర నియోజకవర్గానికి చెందిన పలువురు వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.



హోం మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పెనుకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీఓ శాంతలక్ష్మీ అధ్యక్షతన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం సీడీపీఓ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని బాలిక చదువుతో బంగారు భవితకు బాటవేద్దామనే నినాదాలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ 8వ తేదీ వరకు మహిళా దినోత్సవ వారోత్సవాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.నీలిమారెడ్డి హాజరై సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ, రొద్దం మండలాల సూపర్‌వైజర్లు సుజాతమ్మ, అనురాధ, సుజాత, పుష్ప, యర్రమ్మ, అంగనవాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ కార్యకర్తలు

చిలమత్తూరు: ఎక్కడైతే మహిళా సాధికారత సాధిస్తారో అక్కడే అభివృద్ధి జరుగుతుందని కొడికొండ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపాలనాయక్ పేర్కొన్నారు. శనివారం కొడికొండలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలకు ఆత్మగౌరవం, ఆర్థిక సాధికారత దక్కితే అభివృద్ధి సాధించినట్లవుతుందన్నారు.

ఆడపిల్లల్ని రక్షిద్దాం

హిందూపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా శనివారం హిందూపురం మండలం బసవనపల్లి ప్రాథమిక పాఠశాలలో బేటీ బచావ్, బేటీ పడావ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ శాంతి మహిళల చట్టాలను, వారి భద్రత గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ షిఫాసుల్తానా, జయంత్, షకీలాబాను, పీహెచ్‌ఓ ఈశ్వరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయమ్మ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు ప్రారంభం

● కనిపించిన నెలవంక

● దర్గాపీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో సెహరీ



పురంలో కనిపించిన నెలవంక

హిందూపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. హిందూపురంలో శనివారం సాయంత్రం నెలవంక కనబడటంతో ముస్లింలు మసీదుల్లో తరావి ప్రార్థనలను రాత్రి 8-15నుంచి ప్రారంభించారు. ఆదివారం నుంచి పవిత్ర (రోజా) ఉపవాసాలు ఉండనున్నాయి.

పెనుకొండ:రంజాన్ ఉపవాస దీక్షలకు సిద్ధమవుతున్న ముస్లింలకు ఈ యేడాది కూడా వంశపారంపర్య పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో ఉదయం సెహరీ, సాయంత్రం ఇఫ్తారీల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దీక్షలో ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ఆలయ పూజల్లో పాల్గొన్న ఎంపీ పార్థసారధి

గోరంట్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెండూరువాండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎంపీ బీకే పార్థసారధి ముఖ్య అతిథిగా శనివారం హాజరయ్యారు. టీడీపీ నాయకుడు డాన్స్ కిష్టప్ప కుమారుడు బాలాజీ, నరేంద్రులు 41 అడుగుల ధ్వజస్తంభాన్ని బహూకరించారు. గ్రామస్థులంతా కలిసి రెండు క్రేన్ల సహాయంతో భక్తి శ్రద్ధలతో దానిని ఆలయం ముందు నిలిపారు. పార్టీ నాయకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్థసారధి అనంతరం ఆలయంలో పూజలు జరిపారు. గ్రామంలో పలువురు వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొత్తపల్లి నరసింహప్ప, అశ్వర్థరెడ్డి, నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా ముత్యాల పల్లకి

లేపాక్షి, మార్చి1(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ముత్యాలపల్లకి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. దుర్గా వీరభద్రస్వామి ఆలయం నుంచి శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించిన ముత్యాలపల్లకిలో ఆలయ ప్రధాన ద్వారం నుంచి లేపాక్షి పురవీధుల్లో ఊరేగించారు. పల్లకి సేవ కోసం వచ్చిన భక్తులను కీలుగుర్రాలు ఎంతగానో ఆకర్షించాయి.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రికెట్ టోర్నీకి సిద్ధమైన జట్టు సభ్యులు

పావగడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జీవితంలో ప్రతి ఒక్క ఆటలో గెలుపోటములను సమానంగా స్వీకరించినప్పుడే వారు అనుకున్న లక్ష్యాన్ని భవిష్యత్తులో సాధించగలరని వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు పాళెగార లోకేష్ తెలిపారు. మన పల్లెల్లో మూడు రోజులపాటు జరగనున్న కెపిఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం కరియం ప్రారంభించి మాట్లాడారు. కేవలం సరదా కోసం కాకుండా క్రమశిక్షణతో ఆడితే భవిష్యత్తులో జాతీయస్థాయిలో రాణించవచ్చని తెలిపారు.

పూజారులకు గౌరవవేతనం మంజూరు చేయండి

పెనుకొండ, మార్చి1(ఆంధ్రజ్యోతి) : కురుబల గుడికట్టు పూజార్లకు గౌరవవేతనం మంజూరు చేయాలని కోరుతూ పూజార్లు మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. శనివారం మంత్రిని కలిసిన గుడికట్టు పూజార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాగానే గుడికట్టుపూజార్లకు గౌరవవేతనం ఇస్తామని మాట ఇచ్చారని దాన్ని నిలబెట్టుకోవాలన్నారు.

ఫ్లిప్ కార్ట్ కార్యాలయం తొలగింపుపై ఫిర్యాదు

గోరంట్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కదిరి రోడ్డులో కెంపుల కాంప్లెక్స్ వద్ద ఏర్పాటైన ఫ్లిప్ కార్ట్ కొరియర్ సర్వీస్ కార్యాలయం తొలగించడంతో అందులో పనిచేస్తున్న సిబ్బంది శనివారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుచేశారు. గత ఐదేళ్లుగా ఫ్లిప్ కార్ట్ ఆన్‌లైన్ సంస్థ ద్వారా గోరంట్ల ప్రజలకు పార్శిళ్లు సకాలంలో సరఫరా చేస్తున్నారు. గోరంట్ల కార్యాలయంలో మేనేజర్ కిషోర్, అసిస్టెంట్ మేనేజర్ అబ్దుల్ అకౌంటెడ్ నిషార్ పనిచేసేవారు. వీరు గోరంట్ల మండలానికి చెందిన జయవర్ధన్, జయచంద్రలను టీం లీడర్లుగా రూ. 18 వేల వేతనానికి నియమించుకున్నారు. అలాగే 9 మంది డెలివరీ బాయ్‌లు ఉండగా, వీరందరికీ రెండు నెలల జీతం చెల్లించకుండానే మూడు రోజుల క్రితం ఆఫీస్‌ని ఖాళీ చేసి వెళ్లారన్నారు. వారికి ఫోన్ చేసినా సరైన సమాధానం రాకపోవడంతో సిబ్బంది సీఐ శేఖర్‌కి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని మరవపల్లి గ్రామానికి చెందిన వివాహిత అంజినమ్మ క్రిమిసంహారక మందు తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె భర్త నారాయణస్వామితో కుటుంబ కలహాల నేపథ్యంలో సూపర్ వాస్‌మాల్ తాగి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ ఉష చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిత్యావసరాలు సక్రమంగా అందించాలి

చిలమత్తూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా అందించే నిత్యావసర సరుకులను సక్రమంగా అందించాలని డిటీ జగన్నాథం స్టోరు డీలర్లకు సూచించారు. ఆయన మండల కేంద్రంలోని ఎఫ్‌పీ షాపులను శనివారం తనిఖీచేసి రేషన్ దారులకు అందజేస్తున్న నిత్యావసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. సరుకులు ఏ విధంగా ఇస్తున్నారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా? సమయపాలన పాటిస్తున్నారా? తూనికలు సక్రమంగా ఇస్తున్నారా? అని ఆరా తీసారు. లబ్ధిదారుల నుంచి పిర్యాదులు వస్తే మాత్రం సహించేది లేదన్నారు.

పింఛన్ల పంపిణీ

పరిగి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) :కొడిగెనహల్లి గ్రామ పంచాయతీలో ఎంపీడీఓ శ్రీధర్ శనివారం ఉదయాన్నే ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారుల ఇంటివద్దకు చేరుకుని స్వయంగా పింఛన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండురోజుల్లోపు ప్రతి పింఛన్ దారుడికి పింఛన్ అందేలా సచివాలయ సిబ్బంది చర్యలు చేపట్టినట్లు తెలిపారు.